క్లుప్తంగా

వరద కాలువకు నీటి విడుదల చేయాలి

- చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మల్యాల: రైతులు యాసంగి పంటలు సాగు చేస్తున్న సందర్భంగా వరద కాలువకు వెంటనే నీటి విడుదల చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం వరద కాలువ చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడారు. చొప్పదండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వరదకాలువ విస్తరించి ఉందని, కాలువపై ఆధారపడి వేలాదిమంది రైతులు పంటలు సాగు చేస్తున్నారని, కాలువలో నీరు లేకపోతే రైతులు ఇబ్బంది పడతారని, వెంటనే నీటి విడుదల చేయాలని కోరారు. రెండు రోజుల్లో వరద కాలువకు నీటివిడుదల చేస్తామని అధికారులు తెలిపారని ఎమ్మెల్యే సత్యం వివరించారు.

కార్యకర్తల కృషి మరువలేనిది



సభలో మాట్లాడుతున్న సంజయ్

మెట్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపుకోసం కార్యకర్తలు ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. పట్టణంలోని వీఆర్‌ఎం గార్డెన్‌లో గురువారం కృతజ్ఞత సభ నిర్వహించారు. సంజయ్ మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో రాబోయే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పని చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, చైర్‌పర్సన్లు రాణవేని సుజాత, అన్నం లావణ్య తదితరులున్నారు. అంతకు ముందు పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎర్రోజు తక్షిల్



తక్షిల్

కొండగట్టు: కొడిమ్యాలలోని విజడమ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎర్రోజు తక్షిల్ ఎస్జీఎఫ్ 67వ జాతీయ స్థాయి పాఠశాలల క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సెక్రటరీ లక్ష్మీరాంనాయక్ తెలిపారు. గతనెల గద్వాల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచాడు. అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గా మొదటి స్థానంలో నిలువగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ లింగంపల్లి డెవిడ్సన్ తెలిపారు. ఈనెల 16 నుంచి 23వరకు పాట్నాలో జరిగే అండర్–17 పోటీల్లో రాష్ట్రం తరఫున తక్షిల్ పాల్గొననున్నాడు. తక్షిల్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ దీకొండ అశోక్, కొడిమ్యాల క్రికెట్ క్లబ్ సభ్యులు రాపర్తి లక్ష్మణ్, సామ సురేందర్‌రెడ్డి, కొడిమ్యాల క్రీడాకారులు అభినందించారు.

రైస్‌మిల్లు తొలగించాలని ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న కాలనీవాసులు

రాయికల్: రాయికల్ 10వ వార్డులో ఇళ్లమధ్యలో ఉన్న రైస్‌మిల్లును తొలగించాలని కోరుతూ గురువారం అంగడిబజార్‌లో ధర్నా నిర్వహించారు. కాలనీవాసులు మాట్లాడుతూ, కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు.

డీటీ శ్రావణి బదిలీ

మల్లాపూర్: మల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ శ్రావణిపై బదిలీ వేటు పడింది. గత నెల 16న మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మార్నింగ్ వాక్ అనే వ్యక్తిగత కార్యక్రమంపై డీటీ శ్రావణి చేసిన సానుకూల వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగిన సంగతి తెలిసిందే. దీంతోపాటు విధుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీటీ శ్రావణిని జగిత్యాల ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆమెస్థానంలో మల్యాల సివిల్ సప్లై డీటీగా పనిచేస్తున్న రాకేశ్‌ను నియమించారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మానస హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రిషి, యశ్వంత్, ప్రణీత్ ఇటీవల కేరళ రాష్ట్రంలోని కోజికోడ్‌లో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. వారిని గురువారం అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రజితరావు పాల్గొన్నారు.

3 నెలలు.. రూ.1.47కోట్లు

- మార్కెట్ ఆదాయం పెంపుపై దృష్టి
- కథలాపూర్ మండల లక్ష్యం రూ. 1.95 కోట్లు
- ఇప్పటివరకు రూ.48 లక్షలు వసూలు
- వసతులు కల్పిస్తే పెరగనున్న ఆదాయం



కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ

కథలాపూర్: మిగిలింది మూడు నెలలు.. ముందున్న టార్గెట్ రూ.1.47కోట్లు. ఇదీ.. కథలాపూర్ మార్కెట్‌కమిటీ వార్షిక ఆదాయలక్ష్యం. వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రధాన వనరు ధాన్యంపై విధించే పన్ను. ఏటా ప్రభుత్వం విధించిన లక్ష్యం చేరేందుకు మార్కెటింగ్ అధికారులు కసరత్తు చేస్తుంటారు. 2023–24 ఆర్థిక సంవత్సరం మార్కెట్ కమిటీ ఫీజు వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

లక్ష్యం రూ.1.95 కోట్లు

కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 19 గ్రామాలు ఉన్నాయి. మండలంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, పసుపు, పప్పుదినుసులు సాగు చేస్తుంటారు. మండలంలో పంటల సాగు, విస్తీర్ణం ఆధారంగా ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి కథలాపూర్ మార్కెట్ కమిటీకి రూ.1.95 కోట్లు లక్ష్యం విధించింది. ఇప్పటివరకు రూ.48 లక్షల మార్కెట్ ఫీజు వసూలైనట్లు అధికారులు పేర్కొన్నారు. మార్చినెల వరకు లక్ష్యం చేరుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వసతులు కల్పిస్తే పెరగనున్న ఆదాయం

కథలాపూర్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి పక్కా భవనం ఉంది. పంటల క్రయ విక్రయాల కోసం భవనం పక్కన విశాలమైన స్థలం ఉంది. అందులో వసతులు లేకపోవడం సమస్యగా మారిందని రైతులు అంటున్నారు. ధాన్యాన్ని సెర్ప్, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేస్తున్నారు. మిర్చి, పప్పుదినుసులు మండలంలో ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నామని రైతులు తెలిపారు. మార్కెట్ కమిటీ భవనం పక్కన ఖాళీస్థలంలో చదును చేసి సీసీ నిర్మిస్తే పంటల క్రయ విక్రయాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని, దళారుల బెడద ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి పెట్టాలి



వ్యవసాయ మార్కెట్ కమిటీలో వసతులు కల్పిస్తేనే రైతులకు ప్రయోజనం. సీసీ ప్లాట్‌ఫాంలు నిర్మిస్తే ధాన్యం ఆరబెట్టుకోవచ్చు. విశ్రాంతి భవనం ,మరుగుదొడ్లు నిర్మించాలి. కొత్త ప్రభుత్వం మార్కెట్ కమిటీలో వసతులు కల్పించడంపై దృష్టిసారించాలి.

– జవిడి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్, పెగ్గెర్ల

లక్ష్యం సాధిస్తాం



కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ 1.96 కోట్ల నిధులు గతేడాది మంజూరయ్యాయి. గోదాం, సీసీ, డ్రైనేజీ, మరుగుదొడ్లు నిర్మించడానికి వెచ్చిస్తాం. మార్కెటింగ్ ఫీజు కోసం లక్ష్యం చేరేందుకు అధికారుల, సిబ్బంది సహకారంతో ముందుకెళ్తాం. – గుండారపు సౌజన్య, ఏఎంసీ చైర్‌పర్సన్, కథలాపూర్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు



గొల్లపల్లి జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న అడ్లూరి

గొల్లపల్లి: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గొల్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. గొల్లపల్లి మండలంలో ప్రతి సమస్యను పరిష్కస్తామని తెలిపారు. గ్రామంలో శ్మశాన వాటిక, ఇతర సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిషాంత్‌రెడ్డి, చిర్ర గంగాధర్, పీడీ లక్ష్మీనారాయణ, స్పెషల్ ఆఫీసర్ సాయిబాబా, ఎస్‌ఈ రహమాన్, తహసీల్దార్ ఆరిఫొద్దీన్, ఎంపీడీవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు నెలల్లో రోడ్డు పూర్తిచేస్తాం

వెల్గటూర్: ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్డు పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం వెల్గటూర్ మండలం వెంకటాపూర్‌లో అభయహస్తం దరఖాస్తుల స్వీకరించారు. తాను ప్రతీరోజు నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో అందుబాటులో ఉంటానని ఎవరికి ఏ సమస్య ఉన్నా స్వయంగా వచ్చి కలవవచ్చని తెలిపారు. సర్పంచులు రాందేని రమ, మెరుగు మురళి, సింగిల్‌విండో డైరెక్టర్ రాందేని కోటయ్య పాల్గొన్నారు.

‘ఓటరుగా నమోదు చేసుకోవడం అందరి బాధ్యత’

మల్యాల: ఓటుహక్కు అందరి బాధ్యతగా గుర్తించాలని మల్యాల తహశీల్దార్ మునీందర్ అన్నారు. యువత ఓటుహక్కు నమోదు చేసుకునేందుకు ఈ నెల 6 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలోని బూత్‌లెవల్ అధికారి వద్ద ఓటరు నమోదు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు కార్డులో అడ్రస్ మార్పుతోపాటు ఫొటో, పేరులో తప్పులు సరిదిద్దుకునేందుకు ఫాం–8ను, నూతనంగా ఓటు హక్కు నమోదు కోసం ఫాం–7లో ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటుహక్కు వినియోగించుకుంటున్న విద్యార్థి

కథలాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులందరికీ ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజయ్య, సాంఘీక శాస్త్రం టీచర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ



రాములోరి అక్షింతలతో మేడిపల్లి మండలం లింగంపేట గ్రామస్తులు

ధర్మపురి/మేడిపల్లి/రాయికల్: ధర్మపురిలో గురువారం అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ ఆలయంలో అక్షింతల వితరణ, ఈనెల 22న నిర్వహించే రామాలయ సంప్రోక్షణ కరపత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. అక్షింతలను పట్టణంలోని గిరుకలకాలనీ, దుర్గమ్మకాలనీల్లో పంపిణీ చేశారు. భీమారం మండలం ఈదుల లింగంపేట గ్రామంలో అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప ఆలయం నుంచి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. పురోహితులు మఠం మల్లికార్జున్ పూజలు చేయగా చేశారు. రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయంలో శ్రీరాముని అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా పంపిణీచేశారు. సర్పంచ్ పాదం లత, రాజు, కోల శ్రీనివాస్, దండిక రాజేశం, మల్లేశం, జలపతిరెడ్డి పాల్గొన్నారు.

జగదీశ్వర్‌కు అభినందనలు

జగిత్యాల: టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను జిల్లా టీఎన్జీవో నాయకులు సత్కరించారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ఉద్యోగులందరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు బోగ శశిధర్, అమరేందర్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పెగడపల్లి: సహకార సంఘం ద్వారా పొందిన రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని నంచర్ల సహకార సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్ కోరారు. మండలంలోని నంచర్ల సహకార సంఘం పాలకవర్గం సమావేశం గురువారం జరిగింది. సంఘంలో పొందిన రుణాలు, లావాదేవీలు, డిపాజిట్లు, రుణవసూళ్లు తదితర అంశాలపై చర్చించారు. చైర్మన్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. పంట, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు వాయిదాల ప్రకారం చెల్లించి కేడీసీసీ అందిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాసంగి పంటకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైస్ చైర్మన్ సురేందర్‌రావు, సీఈవో మధుకర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి



కేటీఆర్‌తో శ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల సమాయత్తం నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గురువారం మల్లాపూర్ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ బలోపేతానికి సంబంధించి కేటీఆర్ దిశానిర్దేశం చేశారని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

విజేతలకు ప్రైజ్‌మనీ అందజేత



కోరుట్ల: పట్టణంలో నెల రోజులుగా ఎఫ్‌టీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్‌టోర్నీ ఫైనల్ మ్యాచ్ గురువారం జరిగింది. ఈ మ్యాచ్‌లో ఎం.స్టార్, రాయల్ టీంలు తలపడగా ఎం.స్టార్ టీం విజేతగా నిలిచింది. విజేతజట్టుకు రూ.22 వేల ప్రైజ్‌మనీ, రన్నర్ టీంకు రూ.11వేలు కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్ అందజేశారు. నిర్వాహకులు కె.ప్రవీణ్, రవికిరణ్, సూర్య పాల్గొన్నారు.

క్లుప్తంగా..

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి: గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. మండలంలోని మగ్గిడి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 5వ, తరగతిలో చేరడం కోసం దరఖాస్తు కోరుతున్నట్లు వివరించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వర కు ఉంటుందని, ఈనెల 6లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జాబితాపూర్ సర్పంచ్‌గా కుంట లక్ష్మారెడ్డి

జగిత్యాలరూరల్:మండలంలోని జాబితాపూర్ సర్పంచ్ అంకం మమత నిధుల దుర్వినియోగం విషయంలో సస్పెండ్ అయ్యారు. ప్రస్తుత ఉపసర్పంచ్‌గా ఉన్న కుంట లక్ష్మారెడ్డి తాత్కాలిక బాధ్యతలు గురువారం స్వీకరించారు.

దీపాదాస్ మున్షీని కలిసిన సత్యనారాయణ

కథలాపూర్(వేములవాడ): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ఢిల్లీలో కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నేత చెదలు సత్యనారాయణ కలిశారు. రాష్ట్రంలోని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసినందుకు సత్యనారాయణను ఆమె అభినందించారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా ముజ్జిత్

కోరుట్ల: కోరుట్ల పట్టణ కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎండీ.ముజ్జిత్‌ను నియమిస్తున్నట్లు కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, తిరుమల గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోతరాజు బైండ్ల సంఘ ఎన్నిక

మెట్‌పల్లి: పాత తాలుకా దేవత పోతరాజు బైండ్ల సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబటి జలంధర్, ఉపాధ్యక్షుడిగా ద్యావతి పసుల ప్రకాశ్, కోశాధికారులుగా జంగ సత్యనారాయణ, సురేశ్‌రాజ్ ఎన్నికయ్యారు.

ఒకరికి తీవ్రగాయాలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో గురువారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌కు చెందిన పాలెపు నర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కోరుట్లలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనపై ఆరా తీశారు.

కొనసాగుతున్న ప్రజాపాలన



ప్రత్యేక కౌంటర్లు పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్



గొర్రెపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న నర్సింగరావు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఐదు గ్రామాల్లో గురువారం ప్రజాపాలన నిర్వహించారు. సారంగాపూర్ మండలంలోని మ్యాడారంతండా, ధర్మనాయక్‌తండా, ఒడ్డెర కాలనీ, బీర్‌పూర్ మండలం రాంసాగర్, కమ్మునూర్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

రాయికల్: రాయికల్ మండలం ఇటిక్యాల, తాట్లవాయి, అల్లీపూర్, రాయికల్ పట్టణంలోని 7వ వార్డులో ప్రజాపాలన కేంద్రాలను గురువారం తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు. స్పెషల్‌ఆఫీసర్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు, నాగులపేట, ధర్మారం గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. పైడిమడుగులో 1,287, నాగులపేటలో 583, ధర్మారంలో 740 మంది దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పరిశీలించారు. తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో నీరజ, సర్పంచులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. కమిషనర్ రమేశ్, ప్రత్యేకాధికారి రోహిత్, వైస్ చైర్మన్ రామన్న పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని ప్రజాపాలనలో 1,141 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఊట్‌పెల్లిలో 428, ఇప్పపెల్లిలో 417, తుర్తిలో 266 దరఖాస్తులు వచ్చాయి. ఎంపీడీవో జనార్దన్, తహసీల్దార్ ముంతాజిబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని ల్యాగలమర్రి, దోమలకుంట, కీచులాటపల్లిలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. మూడు గ్రామాల్లో 1,089 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. సర్పంచులు వనజ, హారిక, స్వప్న, ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు, తహసీల్దార్ ఎంఏ ఫరూక్, ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్ పాల్గొన్నారు.

మల్యాల:మండలంలోని రాజారం, మానాల, సర్వాపూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాపాలనలో 1,541మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆరు గ్యారంటీల కోసం 1,304 మంది, 2,37మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, వేములకుర్తిలో నిర్వహించిన ప్రజాపాలనలో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని గొర్రెపల్లి, రత్నాపూర్, వాల్గొండ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్‌తో కలిసి ప్రారంభించారు. ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, సర్పంచ్‌లు కొంపెల్లి సరోజన, మేడి అనూష, దండిక గంగు పాల్గొన్నారు.

కోరుట్లటౌన్: పట్టణంలోని 22, 24, 25, 31వ వార్డుల్లో ప్రజాపాలన నిర్వహించారు. అక్కడి ప్రత్యేక కౌంటర్లను ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



పొలంలో నాట్లు వేస్తున్న విద్యార్థులు

కోరుట్లటౌన్: పట్టణంలోని మాదాపూర్ రహదారి వెంట ఉన్న వ్యవసాయ పొలాలను క్షేత్ర పర్యటనలో భాగంగా కోరుట్ల సాయి జీనియస్ హైస్కూల్ విద్యార్థులు గురువారం సందర్శించారు. వరి పండే తీరు తెలుసుకుని, విద్యార్థులు స్వయంగా పొలంలో వరినాట్లు వేశారు. కూరగాయలు సాగు చేసే పెరటి భూములనుపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చొకి రమేశ్, ప్రిన్సిపాల్ సుధ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రి అందిస్తున్న స్టాఫ్‌నర్స్ సుభాషిని

రాయికల్: రాయికల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులకు జగిత్యాల సివిల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్ సుబాషిని క్రీడా సామగ్రి అందజేశారు. ఉపాధ్యాయులు పొన్నం రమేశ్, రవీందర్, మల్లేశం, గంగజమున, సత్యనారాయణ, జ్యోతి, నాగరాజు, శ్రావణ్, పీఈటీ సుజాత పాల్గొన్నారు.

బీసీలు అవకాశాలు అందిపుచ్చుకోవాలి



రాజేశ్‌ను సన్మానిస్తున్న గోపిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మల్లాపూర్: బీసీలు అన్నిరంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మల్లాపూర్ మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నియామకమైన సిరిపురం రాజేశ్‌ను గురువారం అఖిలపక్ష నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రతిపాదికన అమలు చేస్తున్న రిజర్వేషన్లను బీసీలకూ వర్తింపజేయాలని సూచించారు. బీసీల అభివృద్ధికి అన్ని రాజకీయపక్షాలు కృషి చేయాలని కోరారు. నాయకులు సిరిపురం రవీందర్, బండి లింగస్వామి, రుద్ర రాంప్రసాద్, డబ్బా రమేశ్‌రెడ్డి, లవంగ శివకుమార్, నాగరాజు, నర్సయ్య, శేఖర్, వినోద్, నవీన్, నరేశ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే శిక్షార్హులే



ఆర్డీవోను కలిసిన సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: తల్లిదండ్రులను విస్మరిస్తే శిక్షార్హులేనని జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయోవృద్ధుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 14567 ఉందని, వారిని నిరాధరిస్తున్నా, వేధిస్తున్నా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సంరక్షణ చట్టం ప్రకారం మూడు నెలల వరకు జైలుశిక్షఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ హన్మంతరెడ్డి, బొల్లం విజయ్, యాకూబ్ పాల్గొన్నారు.

పెన్షనర్లను గౌరవించాలి

పెన్షనర్లను గౌరవించాలని జిల్లా ట్రెజరీ అధికారి సోఫియా అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకులు అశోక్‌కుమార్, హన్మంతరెడ్డి, అశోక్‌రావు, యాకూబ్, ప్రకాశ్, రాజేశ్వర్, శివానందం, ట్రెజరీ అధికారి మధు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత



సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: పేదింటి యువతి వివాహానికి మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సాయం అందించారు. మండలంలోని కొత్త దాంరాజుపల్లికి చెందిన అందే స్వప్న వివాహానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు, సామగ్రి, బియ్యం అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 53మంది వివాహాలకు సాయం అందించామని వివరించారు. సభ్యులు పూదరి రామ్‌గౌడ్, రంజిత్‌గౌడ్, చట్ల గణేశ్, చందు, మణిదీప్, మనోజ్, ప్రశాంత్ పాల్గొన్నారు.